16 నుంచి 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో కిడ్స్ సమ్మర్ క్యాంప్‌ను ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్వీయ చర్చా కార్యక్రమం, సృజనాత్మక ధ్యానం, విలువలతో కూడిన కార్యకలాపాలు, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం, మైండ్‌ల్యాబ్, డిజిటల్ వెల్‌నెస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9–14 ఏళ్ళ లోపు వారికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234, సెల్ నంబర్ 8143466670 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఫంక్షన్‌హాల్ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్ కాలనీవాసుల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుందన్నారు. ఫంక్షన్ హాలును అన్ని హంగులతో నిర్మిస్తామని తెలిపారు. చిల్డ్రన్స్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పోశెట్టిగౌడ్, యాదగిరి, అగ్రవాసు, ముజీబ్, మహేష్, రవీందర్, మల్లేష్ పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని అన్నారు. కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే కాలనీకే బస్సును పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919493417 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్‌లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన రాజగోపురం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు. కాగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 11 మందికి రూ.1500 జరిమానా, మరో ఇద్దరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నాగేశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ అపోలో ఆస్పత్రి వెనక గుర్తు తెలియని వ్యక్తి (55) చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీలో ఉంచారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని, సంబంధిత వ్యక్తులు ఉంటే గచ్చిబౌలి పీఎస్‌లో సంప్రదించాలన్నారు. 9409061727 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.





నిధులన్నీ 'చెరువు' పాలు

మీదికుంట చెరువు అభివృద్ధికి రూ. కోటి 70 లక్షలు మంజూరు

- ఏప్రిల్ 30– 2022న శంకుస్థాపన
- కేవలం 10రోజులే పనులు చేసి వదిలేసిన వైనం
- నిధులు గోల్‌మాల్‌అంటూ ఆరోపణలు

మియాపూర్: మీదికుంట చెరువు అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది. 3 సంవత్సరాలు గడిచినా పనులు ముందుకు సాగలేదు. శంకుస్థాపన చేసిన తర్వాత కొంత మేర పనులు చేపట్టి వదిలేశారు. చెరువు అభివృద్ధికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మియాపూర్‌లోని చెరువులకు కోట్ల రూపాయల నిధులు కేటాయించి కొంత మేర పనులు చేపట్టి వదిలేశారు. మరలా సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. మొదట కేటాయించిన నిధులు ఎటు పోయాయని సర్వత్రా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు సుందరీకరణ పనులు మూడు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. దీంతో చెరువులో గుర్రపుడెక్క, మురుగునీరు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది.
- చెరువు సుందరీకరణ పనులకు రూ.1కోటి 70లక్షలు కేటాయించి ఈ పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఏప్రిల్ 30– 2022న సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.
- కొన్ని రోజుల పాటు చెరువు చుట్టు వ్యర్థాలను తొలగించి కొంతమేర మట్టితో చెరువుకట్టగా వేసి వదిలేశారు. 10 రోజుల పాటు పనులు చేపట్టి మధ్యలోనే పనులు వదిలేశారు
- చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చిన మురుగు చెరువులో చేరుతూ దుర్గంధం వెదజల్లుతుంది. దీనితో పాటు చెరువులో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగాయి.
- మీదికుంట చెరువు గతంలో విస్తీర్ణానికి, ప్రస్తుతం చెరువు సుందరీకరణ పనులు చేపట్టిన విస్తీర్ణానికి చాలా వ్యత్యాసం ఉందని స్థానికులు అంటున్నారు. చెరువును సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేసి పనులను చేపట్టాలని అంటున్నారు. కానీ అధికారులు నామమాత్రంగా సర్వే చేపట్టి కబ్జాలు తొలగించకుండానే చుట్టు మట్టి వేశారని పేర్కొంటున్నారు.

సగంసగం పనులు..

మొదట చెరువుల అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు మంజూరు చేసి కొంతమేర పనులు చేసి వదిలేస్తున్నారు. రెండు,మూడు సంవత్సరాలు గడిచాక మరలా చెరువుల అభివృద్ధి పేరిట సీఎస్ఆర్ నిధులతో చేపట్టేందుకు ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. మొదట కేటాయించిన నిధుల సంగతేంటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంజూరైన నిధులకు, చేసిన పనులకు ఎక్కడా పొంతన లేదని అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతుంది.

నాలా కబ్జా...

మియాపూర్‌లోని మీదికుంట చెరువు నుండి మక్తమహబూబ్‌పేట పెద్దకుడి చెరువుకు వెళ్లే నాలా ఆక్రమణలకు గురైందని స్థానికులు తెలిపారు. కొంతమంది నాలాను కబ్జా చేసి మలుపులుగా మళ్లించడంతో 30 ఫీట్లు ఉండాల్సిన నాలా 10 ఫీట్లకే పరిమితమైంది. అధికారులు కూడా ఈ నాలను 10 ఫీట్ల వరకే బాక్స్ నాలాగా నిర్మాణ పనులు చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి నాలా, చెరువును సర్వే చేయడంతో బాటు అభివృద్ధి పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

లింకురోడ్డులో భారీ గుంతలు..

గచ్చిబౌలి: లింకురోడ్డులో ఏర్పడిన గుంతలతో వాహనదారులు నానా ఇబ్బందులుపడుతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న లింకురోడ్డులో రెండు చోట్ల లోతైన గుంతలు ఏర్పడ్డాయి. సర్కిల్ కార్యాలయం ఎదురుగా లింకురోడ్డుకు వెళ్లే చోట, స్ప్రింగ్‌వ్యాలీ ఎదురుగా మరో గుంత ఏర్పడింది. మట్టి బండ రాళ్లతో వచ్చే టిప్పర్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు స్టీల్, సిమెంట్ కంటైనర్‌లు, వాటర్ ట్యాంకర్ల రాకతో రోడ్లపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం అధికారులు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు చిన్నపాటి మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శేరిలింగంపల్లి సర్కిల్ ఎదురుగా ఉన్న లింకురోడ్డులో ఏర్పడిన గుంతలు

'ఫిలింనగర్ రోడ్' నం.1 .. అక్రమ పార్కింగ్‌లు

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్ నం.1లో పదికి పైగా కాఫీ షాపులు, హోటళ్లు నడుస్తున్నాయి. అయితే ఎవరికీ సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో కస్టమర్లు ఫుట్‌పాత్‌లు, రోడ్లకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు కార్లు పార్కింగ్ చేస్తుండడంతో బిజీగా ఉండే ఈ రోడ్డు ట్రాఫిక్‌జామ్‌కు గురవుతోంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఈ కాఫీ షాపులు, హోటళ్ల ముందు అక్రమ పార్కింగ్‌లపై దృష్టి పెట్టకపోవడంతో రోజురోజుకు సమస్య తీవ్రరూపం దాల్చుతోంది.

- ఫుట్‌పాత్‌లు కనుమరుగైపోవడంతో పాదచారులు రోడ్డెక్కుతున్నారు. ఇంకొంతమంది హోటళ్ల యజమానులు తమ వద్దకు వచ్చే కస్టమర్ల కార్లను వ్యాలెట్ పార్కింగ్‌లో కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలాల్లో దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. ఫిలింనగర్ రోడ్ నం.1లో హోటళ్లకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో యథేచ్ఛగా రోడ్లపై, కేబీఆర్ జీహెచ్ఎంసీ వాక్‌వే, పార్కింగ్ స్థలంలోనూ పార్కింగ్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌లపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇదే పరిస్థితి జూబ్లీహిల్స్ రోడ్ నం.92లోనూ కనిపిస్తోంది.


ఫిలింనగర్ రోడ్ నం.1లో కాఫీ షాపు ముందు ఫుట్‌పాత్‌పై పార్కింగ్

కేంద్రీయ విద్యాలయ..100 శాతం ఉత్తీర్ణత



'పది'లో టాపర్‌గా కార్తీక్ ఆనంద్

రాయదుర్గం: సీబీఎస్ఈ ఫలితాల్లో గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ వంద శాతం ఫలితాలు సాధించింది.పదవ తరగతి టాపర్‌గా కార్తీక్ ఆనంద్ 98.6 శాతం మార్కులు సాధించాడు. 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 37 మంది విద్యార్థులు 90 శాతం పైనే మార్కులు సాధించడం మరో విశేషం. అలాగే 12వ తరగతిలో 50 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.

మ్యాథ్స్, సైన్స్ ఇష్టం..



నాకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు అంటే చాలా ఇష్టం . ఇంటర్మీడియట్‌లో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటా. మా తండ్రి నల్లతంబి బ్యాంకు ఉద్యోగి. కేంద్రీయ విద్యాలయలో 1వ తరగతి నుంచి చదువుతున్నాను, బోధనలో, క్రమశిక్షణ ఆచరించేలా ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ చూస్తారు. నాకు ఫుట్‌బాల్ ఆడడం చాలా ఇష్టం.

– పదవ తరగతి టాపర్ కార్తీక్ ఆనంద్

ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల..



ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, పోటీతత్వంతో చదవడంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం కలిగింది. పది, ప్లస్2లో 100 శాతం ఫలితాలను ఆరంభం నుంచి సాధిస్తూ వస్తున్నాం.ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది.

– జితేంద్రకుమార్, ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయ, గచ్చిబౌలి

ముగిసిన లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో హోమం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బస్తీదర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 11 ,12 బ్లాక్‌లలో బుధవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ త్వరలో డ్రైనేజీ సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం

తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్


శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న కల్నల్ రాకేష్‌కుమార్

రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యమని తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్ పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజసేవ, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం లక్ష్యం అని అన్నారు. సైనికులకు ఇచ్చే తరహాలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణా శిబిరంలో రంగారెడ్డిజిల్లాకు చెందిన 600 మంది కాలేజీ విద్యార్థులు, 12 పాఠశాలలకు చెందిన క్యాడెట్లు పాల్గొంటున్నారన్నారు. ఈనెల 17వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్, గణేష్, సబ్ మేజర్ కిషోర్‌సింగ్ ఏఎస్‌ఓ ఆఫీసర్లు, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఊట్ల కృష్ణ, నర్సింహ యాదవ్, ఊట్ల దశరథ్, రాధాకృష్ణ యాదవ్, మాధవి, రమేష్, మణిరత్నం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేశవనగర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


రోడ్లను శుభ్రం చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అంతర్గత రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈశ్వర్, తిరుపతి, సుమన్, నగేష్, రాజు, శ్రీనివాస్, యాదయ్య, గోవింద్, హన్మంతు, జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది కృష్ణ, మల్లేష్, కేశవనగర్‌వాసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

పటాన్‌చెరు టౌన్: ఆవులు ఎద్దులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోటేశ్వర్‌రావు అన్నారు. బక్రీద్‌ని పురస్కరించుకొని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ముత్తంగి జాతీయ రహదారిపై బుధవారం పటాన్‌చెరు పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. పశువులను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పశువులను తరలించాలంటే వెటర్నరీ అధికారుల ధ్రువీకరణ పత్రం ఉండాలని పోలీసులు అడిగిన వెంటనే చూపాలని తెలిపారు. నిబంధనల ప్రకారం తరలించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు

22న హనుమాన్ జయంతి వేడుకలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా 22న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామికి అభిషేకం, అర్చనలు, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం, మహా నివేదన, ఊరేగింపు ఉంటాయని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఆంజనేయ స్వామికి సుగంధ పరిమళాలతో అభిషేకం, సింధూరం పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ, మన్యసూక్తంతో హోమం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

28న సొసైటీ ఎన్నికలు

మోతీనగర్: మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ఈ నెల 28న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంసీహెచ్ఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి టి. విష్ణు వర్ధన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 21న 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, 22 ఉదయం 11 గంటల నుంచి 5:30 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, గుర్తులు కేటాయించనున్నట్లు తెలిపారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

మోతీనగర్: డ్రైనేజీలోని చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కరెంట్ ఆఫీస్ వీధిలో బుధవారం జలమండలి మేనేజర్ అన్విత్ కుమార్‌తో కలిసి భూగర్భ డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తా చెదారం, మట్టిని సిబ్బందితో తొలగింపజేశారు.

స్టాక్ మార్కెట్ పేరిట సైబర్ మోసం

రూ.21 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి సూర్యోదయ కాలనీ నివాసికి మార్చి 25న వాట్సప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశారు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. అతను నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. ఇలా రెండు నెలల నుంచి లావాదేవీలు చేస్తూ వచ్చాడు. బాధితునికి పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మొత్తం రూ.21 లక్షల 6 వేలు ఇన్వెస్ట్ చేశాడు. బుధవారం తాను పెట్టిన నగదుతో పాటు లాభం ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఐదు లక్షల నగదును ఫ్రీజ్ చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మర్ క్యాంప్



చందానగర్ సర్కిల్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు సందడిగా మారాయి. చిన్నారులు వివిధ క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. సుమారు 17 క్రీడలలో 800 మంది చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. రన్నింగ్, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్, తైక్వాండో, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, యోగా, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, క్యారమ్, బాక్సింగ్ క్రీడల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. – చందానగర్


